# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 22-07-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశం కోసం జీవితాన్ని అంకితం చేయడమే ఉత్తమ జీవన మార్గమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ పార్లమెంటు ఉభయ సభలు విపక్షాల నినాదాలతో రేపటికి వాయిదా పడ్డాయి.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికార పర్యటనలో భాగంగా రేపు బ్రిటన్‌కు వెళ్లనున్నారు.
- ❖ జనాభా లెక్కలకు సన్నద్ధత ప్రారంభమైందని కేంద్ర ప్రభుత్వం ఈరోజు లోక్ సభలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = =

సమాజం, దేశం కోసం జీవితాన్ని అంకితం చేయడమే జీవించడానికి ఉత్తమ మార్గమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈరోజు న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో 2018-2021 సంవత్సరాలకు గాను 52వ రాష్ట్రపతి స్కౌట్స్ అండ్ గైడ్స్ అవార్డులను ద్రౌపది ముర్ము ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు చెందిన 16 మంది స్కౌట్స్, గైడ్స్, రోవర్స్, రేంజర్స్‌కు అవార్డులను, ప్రశంసాపత్రాలను అందుకున్నారు. క్రమశిక్షణ, సంఘ సేవ, నాయకత్వం, విలువైన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము మాట్లాడుతూ... భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వంటి సంస్థలు యువతలో నిస్వార్థ సేవ, దేశభక్తి, నైతిక విలువలను పెంపొందిస్తాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు ఉభయ సభలు ఈరోజు విపక్షాల నినాదాలతో పలు మార్లు వాయిదా పడ్డాయి. దీనితో లోక్‌సభ, రాజ్యసభలు రేపటికి వాయిదా వేశారు. ఆపరేషన్ సింధూర్, బీహార్ ఎన్నికల ఓటర్ల జాబితాలో చేపట్టిన సవరణలు మొదలగు అంశాలపై చర్చ చేపట్టాలని విపక్షాలు చేసిన ఆందోళనలతో సభా కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. దీనిపై లోక్ సభలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విపక్షాలు చర్చను కోరుకోవడం లేదని, కావాలని గందరగోళాన్ని సృష్టిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టం

చేసినా విపక్షాలు మాత్రం ముందుకు రాలేదన్నారు. సభాపతి పలు మార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పరిస్థితి మారకపోవడంతో లోక్ సభను రేపటికి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా ఇటువంటి పరిస్థితులే కొనసాగడంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ సభను రేపటికి వాయిదా వేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికార పర్యటనలో భాగంగా రేపు బ్రిటన్ కు వెళ్లనున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత ప్రధానమంత్రి బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్‌తో చర్చలు జరుపనున్నారు. అనంతరం కింగ్ ఛార్లెస్ III తో సమావేశమవుతారు. భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ ఈరోజు న్యూఢిల్లీలో ఆ వివరాలను వెల్లడిస్తూ... ఇరు దేశాలకు చెందిన వ్యాపార ప్రముఖులతో కూడా నరేంద్ర మోదీ సమావేశం అవుతారని తెలిపారు. ఈ పర్యటన భారత్- బ్రిటన్ ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించడంతోపాటు, మరింత బలోపేతం చేయడానికి అవకాశం కల్పిస్తుందన్నారు. ఇరు దేశాల ప్రధానమంత్రులు ప్రాంతీయ, ప్రపంచ ప్రాముఖ్యత కలిగిన అంశాలపై అభిప్రాయాలను పంచుకోనున్నారు. ఈ భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడానికి ఇరుపక్షాలు కట్టుబడి ఉన్నాయని విక్రమ్ మిస్రీ వివరిస్తూ....

(వాయిస్ 30 సెకన్లు)

అదే విధంగా మాల్దీవుల అధ్యక్షులు మహ్మద్ మొయిజ్జు ఆహ్వానం మేరకు ఈనెల 25 నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆ దేశంలో పర్యటిస్తారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

గత నెల 16న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయడంతో 2027 జనాభా లెక్కింపు ప్రక్రియ (సెన్సస్) ప్రారంభమైందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈరోజు లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ పేర్కొంటూ... ఈ విషయంపై ఈనెల 3, 4వ తేదీలలో న్యూఢిల్లీలో రెండు రోజుల పాటు సమావేశం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్, ఆ శాఖ సీనియర్ అధికారులు, రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ కార్యాలయ అధికారులు హాజరయ్యారని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత సైన్యానికి మరొక ముఖ్యమైన ఆయుధ సంపత్తిగా నిలచే అపాచీ హెలికాప్టర్లు ఈరోజు అమెరికా నుంచి భారత్‌కి చేరుకున్నాయి. ఇది భారత సైన్య వైమానిక పోరాట బలాన్ని గణనీయంగా పెంచుతుంది. ఒక ఇంజినీరింగ్ అద్భుతంగా నిలచే ఈ హెలికాప్టర్లు అధునాతన ఆయుధాలు, సెన్సార్లు కలిగి అన్ని వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే సామర్థ్యం కలిగి ఉన్నాయి. భారత వైమానిక దళం 2015లో అమెరికా ప్రభుత్వం, బోయింగ్ సంస్థలతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా 22 అపాచీ హెలికాప్టర్లను కొనుగోలు చేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = =

ఇటీవల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖర్‌కు మంచి ఆరోగ్యం కలగాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. భారతదేశ ఉపరాష్ట్రపతితో సహా వివిధ హోదాల్లో దేశానికి జగదీప్ ధన్‌ఖర్ సేవ చేసారని ఈరోజు సామాజిక మాధ్యమం వేదికగా ఎక్స్ కొనియాడారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

WAVES ప్లాట్‌ఫామ్ కంటెంట్‌ను వినియోగదారులకు మాత్రమే కాకుండా, సంస్థలకు, ప్రవాస సంఘాలకు చేరువ చేయడంలో సహాయపడుతుందని ప్రసార భారతి CEO గౌరవ్ ద్వివేది అన్నారు. ఈ రోజు కంబోడియాలోని జరిగిన

20వ ఆసియా మీడియా సమ్మిట్‌లో WAVES OTT ప్లాట్‌ఫామ్‌పై ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... WAVES OTT.. గ్రామీణ ప్రాంతాల ప్రజల గొంతులను ప్రపంచ ప్రేక్షకులకు వినిపించడానికి, సాంప్రదాయ కథనాలను సమకాలీన రూపాల్లోకి తీసుకురావడానికి రూపొందించబడిందని చెప్పారు. భారతీయ వారసత్వం ఆధునిక రూపాలను పొందుతుందని గౌరవ్ ద్వివేది పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ దరఖాస్తుల సమర్పణకు ఆగస్టు 15వ తేదీ వరకు గడువు పొడిగించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఏప్రిల్ 1న జాతీయ అవార్డుల పోర్టల్‌లో ప్రారంభమైంది. ధైర్య సాహసాలు, సామాజిక సేవ, పర్యావరణం, క్రీడలు, కళలు-సంస్కృతి, శాస్త్రసాంకేతిక రంగాలలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందే సామర్థ్యం కలిగిన పిల్లలకు ఈ అవార్డులు ప్రధానం చేస్తారు. 5 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన చిన్నారులు వారు ఈ అవార్డులకు అర్హులు.

= = = = = = = = = = = = = = = = = = = = =

బొలివియా అధ్యక్షులు లూయిస్ అల్బెర్టో భారత ప్రభుత్వానికి  కృతజ్ఞతలు తెలిపారు. 3 లక్షల మీజిల్స్, రుబెల్లా (MR) వ్యాక్సిన్ డోసులను విరాళంగా భారత్ అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ వ్యాధుల వ్యాప్తి నుంచి పిల్లలను రక్షించడంలో భారత్ అందించిన సహకారం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని, 14 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చిన్నారుల కోసం బొలివియా చేపట్టే సామూహిక రోగనిరోధక టీకా కార్యక్రమానికి ఈ టీకాలు ఉపకరిస్తాయని బొలీవియా అధ్యక్షులు పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = =

భారత్, ఇంగ్లాండ్ మహిళా క్రికెట్ జట్ల మధ్య లండన్ లో జరుగుతున్న మూడవ వన్డే క్రికెట్ మ్యాచ్ లో బ్యాటింగ్ చేస్తున్న భారత్ 44 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్ల నష్టానికి 252 పరుగులు చేసింది. ఇక పురుషులు క్రికెట్‌లో భారత్ ఇంగ్లాండ్ జట్ల మధ్య నాలుగవ టెస్ట్ మ్యాచ్ రేపు మాంచెస్టర్ వేదికగా ప్రారంభం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = =

దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో రానున్న కొన్ని రోజులు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త సుప్రీత్ కుమార్ తెలిపారు.  కేరళ, కర్ణాటక, కోస్తా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కొంకణ్, గోవా, మధ్య మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీస్‌గఢ్‌లలో రానున్న వారం రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వెల్లడిస్తూ...

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = =